Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్ సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 290
పేజీలు : 3
బుధవారం 20.05.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులకు గుడ్‌న్యూస్

### గరిష్ఠ వయో పరిమితి పెంపు

**టి మీడియా ,మే 19 ,హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణలో నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లో ఉంటాయని జీవోలో పేర్కొంది. పోలీసు తదితర యూనిఫామ్ సర్వీసులకు సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గరిష్ఠ వయో పరిమితిని పదేళ్ల పాటు సడలించారు. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో నిరుద్యోగుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరో ఏడాది పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తాజాగా జీవో జారీ చేసింది.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు అయిపోలేదు

- మరో రూ.13-17 పెరిగే ఛాన్స్
- వారంలో రెండు సార్లు పెరిగిన ధరలు



**టి మీడియా ,మే 19 , ఢిల్లీ బ్యూరో:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, ఇటీవల కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3మేర పెంచిన విషయం తెలిసిందే. అయితే అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో, దేశంగా పెట్రో ధరలు మరింత భారీగా పెంచాల్సిన అవసరం ఉందని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ 'కోటక్? ఇన్?స్టిట్యూషనల్? ఈక్విటీస్' స్పష్టం చేసింది. దేశీయ చమురు మార్కెటింగ్? కంపెనీలు (ఓఎంసీలు) ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాలను నివారించాలంటే ఇది తప్పనిసరి అని పేర్కొంది.

### లీటర్ పెట్రోల్‌పై రూ.17 వరకు పెంచాల్సిందే!



ఇటీవల చేసిన పెట్రోల్, డీజిల్?ల ధరల పెంపు ఏమాత్రం సరిపోదని, లీటరుకు అదనంగా మరో రూ.13 నుంచి రూ.17 వరకు పెంచాల్సి ఉంటుందని కోటక్? అభిప్రాయపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఇంకా ఇలానే కొనసాగితే పరిస్థితి దారుణంగా ఉంటుందని తెలిపింది. ఇంధన ధరల పెంపు, బంగారం దిగుమతి సుంకాల పెంపు, పొదుపు చర్యలు వంటి భారత ప్రభుత్వ నిర్ణయాలు దేశ ఆర్థిక సవాళ్లను పూర్తిగా పరిష్కరించలేకపోవచ్చని అభిప్రాయపడింది.

### వారంలో రెండు సార్లు పెరిగిన ధరలు

ఇటీవల కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలను రెండు సార్లు పెంచారు. ఇంతకు ముందు? లీటర్? పెట్రోల్, డీజిల్?? ధరలను రూ.3 మేర పెంచగా, మంగళవారం మరో 90 పైసలు మేర వడ్డించారు. అయినప్పటికీ ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు వస్తున్న నష్టాలను పూడ్చడానికి ఈ పెంపు ఏమాత్రం సరిపోదని కోటక్ భావిస్తోంది.చమురు విక్రయాల ద్వారా వస్తున్న రాబడి తక్కువగా ఉండడం వల్ల ఓఎంసీలు ప్రస్తుతం ప్రతి నెలా దాదాపు రూ.25వేల కోట్లు మేర నష్టాన్ని చవిచూస్తున్నాయని కోటక్ అంచనా వేసింది. ప్రస్తుతం డీజిల్ అమ్మకాలపై లీటర్?కు రూ.11.40 నష్టం, పెట్రోల్ అమ్మకాలపై లీటర్?కు రూ.14.30 నష్టం వస్తున్నట్లు అంచనా. ఈ నష్టాలను పూడ్చాలంటే, పెట్రో ధరలను లీటర్?కు రూ.13-17 వరకు పెంచాల్సిందేనని స్పష్టం చేసింది.

### దశలవారీగా పెంపు

ఇప్పటికే పెరిగిన ఇంధన ధరలో ప్రజలు ఇబ్బంది పడుతుంటే, మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఇక్కడితో ఆగిపోదని నివేదికలు సూచిస్తున్నాయి. గత 75 రోజులుగా పేరుకుపోయిన నష్టాలను రికవరీ చేసేందుకు చమురు కంపెనీ ప్రయత్నిస్తున్నాయని, అయితే ఒకేసారి కాకుండా క్రమంగా (దశలవారీగా) పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎందుకంటే, వినియోగదారులపై ఒక్కసారిగా ద్రవ్యోల్బణ భారం పడకుండా చూసేందుకు విధానకర్తలు, చమురు కంపెనీలు జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాయి. కాగా, వినియోగదారులను రక్షించడానికి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పరిమితం చేసేందుకు ధరలను క్రమంగా పెంచాలని భావిస్తున్నట్లు ఇండియన్ ఆయిల్? కార్పొరేషన్? (ఐఓసీ) అధికారి ఒకరు తెలిపారు.మే 15 నాటి ధరల పెంపు వల్ల చమురు కంపెనీల రోజువారీ నష్టాలు నాలుగో వంతు తగ్గినప్పటికీ, అంతకు ముందు వారు రోజుకు దాదాపు రూ.750 కోట్ల నష్టాన్ని చవిచూశారని పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ ఈ వారం ప్రారంభంలోనే చెప్పారు. మరోవైపు నష్టాలు కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో రిటైల్ ఇంధన ధరలు 10 శాతం మేర పెరిగే ఛాన్స్ ఉందని ఐడీఎఫ్?సీ ఫస్ట్ బ్యాంకు కూడా అంచనా వేసింది.

### అది సరైనా నిర్ణయమేనా?

బంగారం దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని కోటక్ ప్రశ్నించింది. ఇది తాత్కాలికంగా కొనుగోళ్లను ఆలస్యం చేసినప్పటికీ, దేశీయంగా బంగారం ధరలను పెంచుతుందని పేర్కొంది. అంతేకాదు ప్రజల వద్ద ఉన్న బంగారం విలువను కూడా పెంచుతుందని తెలిపింది. బంగారంపై దిగుమతి సుంకాలు పెంచడం కంటే, జీఎస్టీ రేటును పెంచడం మరింత ప్రభావవంతంగా ఉండేదని బ్రోకరేజీ సంస్థ సూచించింది.మరోవైపు ముడి చమురు ధరలు బ్యారెల్?కు 100 డాలర్ల నుంచి 120 డాలర్ల మేర పెరుగుతోంది. ఇలా బ్యారెల్?కు ప్రతిసారీ 10 డాలర్లు చొప్పున పెరిగితే, భారత కరెంట్ ఖాతా లోటు సుమారు 22 బిలియన్ డాలర్ల మేర పెరుగుతుందని కోటక్ అంచనా వేసింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే, వృద్ధి, ద్రవ్యోల్బణం, ఆర్థిక లోటు, బాహ్య స్థిరత్వాలను సమతుల్యం చేయడం చాలా కష్టమవుతుందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే 2027 ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిని 6 శాతంగా, సగటు ద్రవ్యోల్బణాన్ని 5 శాతంగా కోటక్ అంచనా వేసింది.

## భారత్‌లో తీవ్రమైన ఆర్థిక తుపాను

- లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ



**టి మీడియా ,మే 19 , ఢిల్లీ బ్యూరో:** భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు.

### ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్ఆర్ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

### రైతులు నాశనమవుతారు- పేదలు తుడిచిపెట్టుకుపోతారు'

ప్రజలు మేల్కొని రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి. మీరు ఈ ప్రభుత్వాన్ని మార్చకపోతే ఈ దేశం మనుగడ సాగించదు. ఎంజీఎన్ఆర్ఈజీఏ రద్దు చేస్తారు. రైతులు నాశనమవుతారు. పేదలు తుడిచిపెట్టుకుపోతారు. కానీ మోదీ, అమిత్ షా సహా దేశ నాయకులందరూ అంబానీ ఇంట్లో జరిగిన పెళ్లికి హాజరవుతుంటారు. గతంలో ప్రజలు తమ ఇంటి పొదుపును తమ ఇళ్లలోనే ఉంచుకునేవారు. అయితే, ఇప్పుడు మోదీ ఆ డబ్బును మీ జేబుల నుంచి దోచుకుని అదానీ, అంబానీలకు, తన అనుచరులకు అప్పగించారు. వారు జీఎస్టీ పేరుతో నిధులను పక్కదారి పట్టిస్తున్నారు." అని రాహుల్ గాంధీ అన్నారు.రెండు రోజుల పర్యటన కోసం ఉత్తర్‌ప్రదేశ్‌కు వచ్చిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలైన రాయ్‌బరేలీ, అమేథీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం లఖ్‌నవూ విమానాశ్రయంలో దిగిన ఆయన, అక్కడి నుంచే నేరుగా తన నియోజకవర్గమైన రాయ్‌బరేలీ వెళ్లారు. విమానాశ్రయంలో రాహుల్ గాంధీకి ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్, ఇతర నేతలు స్వాగతం పలికారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు

### పనులు త్వరగా పూర్తి చేయండి: సీఎం రేవంత్ రెడ్డి



**టి మీడియా ,మే 19, హైదరాబాద్ బ్యూరో :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆ జిల్లా సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం కీలక ఆదేశాలు : - పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు - జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇతర సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు - భూసేకరణ నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం ఉండదని, చెల్లింపులను తక్షణమే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు - జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు - అధికారులతో కలిసి ప్రాజెక్టుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని, పనుల అమలును నిశితంగా పర్యవేక్షిం చాలని జిల్లా మంత్రులను కోరారు. ఈ సమావేశానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, రాకేష్ రెడ్డి, వంశీ కృష్ణ, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు హాజరయ్యారు.

## దేవాలయాల బంగారంపై... కన్నేసిన ప్రభుత్వం?

### వదంతులపై క్లారిటీ ఇచ్చిన ఆర్థిక శాఖ!



**టి మీడియా, మే 19 , ఢిల్లీ బ్యూరో :** బంగారం కొనకండి అంటూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల సికింద్రాబాద్ సభ వేదికగా యావత్ దేశానికి పిలుపు నిచ్చారు. ఏడాదిపాటు పెళ్లిళ్ల సందర్భంగా బంగారం కొనుగోలు చేయకూడదని సూచించారు. దిగుమతి వస్తువుల వాడకం తగ్గించినా, ఆపేసినా, అది దేశభక్తి అవుతుందంటూ మోదీ చెప్పారు. దీంతో సోషల్ మీడియాలో.. కొన్ని వర్గాల్లో భారత ప్రభుత్వం దేవాలయాల వద్ద ఉన్న బంగారాన్ని నగదుగా మార్చుకోబోతోందని, అలాగే ప్రజల బంగారం ప్రభుత్వం లెక్కలు వేస్తుందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ వార్తలు ప్రజల్లో తీవ్ర గందరగోళానికి దారితీయడంతో, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగి ఈ ఊహాగానాలను పూర్తిగా కొట్టివేసింది.ప్రభుత్వం దేవాలయ ట్రస్టుల వద్ద ఉన్న బంగారాన్ని స్వాధీనం చేసుకుంటుందనే వాదనలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమైనవి అని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆలయ గోపురాలు, ద్వారాలు లేదా ఇతర కట్టడాలపై ఉన్న బంగారం దేశ వ్యూహాత్మక నిల్వలకు సంకేతమని వస్తున్న వార్తల్లో కూడా ఎటువంటి నిజం లేదని పేర్కొంది. ఇటువంటి తప్పుడు సమాచారం ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాకుండా అనవసర భయాందోళనలకు గురిచేస్తుందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.ప్రపంచ దేశాలతో పోల్చితే భారతీయ ఇళ్లలో, దేవాలయాలలో ఉన్న బంగారం విలువ చాలా ఎక్కువ. ఒక అంచనా ప్రకారం.. భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ వద్ద అధికారికంగా సుమారు 880 టన్నుల బంగారం ఉంది. అలాగే, అధికారిక లెక్కలు లేనప్పటికీ, నిపుణుల అంచనా ప్రకారం దేశంలోని వివిధ దేవాలయాల్లో 3,000 నుండి 4,000 టన్నుల బంగారం ఉండవచ్చు. ఇది అనేక అభివృద్ధి చెందిన దేశాల కేంద్ర బ్యాంకుల నిల్వల కంటే కూడా ఎక్కువ.విధాన నిర్ణయాలు లేదా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఏ సమాచారాన్నైనా అధికారిక వెబ్‌సైట్లు, పత్రికా ప్రకటనలు, ధృవీకరించిన వేదికల ద్వారా మాత్రమే తెలుసుకోవాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించింది. అనధికారిక మూలాల నుండి వచ్చే సమాచారాన్ని నమ్మవద్దు, వ్యాప్తి చేయవద్దు అని దేశ పౌరులను కోరింది.మరోవైపు, ప్రభుత్వం బంగారం కొనుగోళ్లపై ఎటువంటి నిషేధం విధించలేదు. మతపరమైన సంస్థల ఆస్తులపై ఎటువంటి ప్రతికూల నిర్ణయాలు తీసుకోలేదు. ధృవీకరించని వార్తలను షేర్ చేసే ముందు వాటి వాస్తవికతను పరిశీలించడం బాధ్యతాయుతమైన పౌరులుగా మనందరి కర్తవ్యం..!

## ఆఫ్రికాలో ఎబోలా వైరస్ ఉద్ధృతి

### ఈ వ్యాధి దేశంలోకి రాకుండా భారత్ అప్రమత్తం



**టి మీడియా ,మే 19 , ఢిల్లీ బ్యూరో :** ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా సహా పలు దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి మరోసారి ప్రపంచ ప్రజారోగ్య ఆందోళనలను పెంచింది. ఈ క్రమంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలా వ్యాప్తిని నిశితంగా గమనిస్తున్నామని భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. దేశంలోకి ఈ వ్యాధి ప్రవేశించకుండా నిఘా పెట్టామని పేర్కొన్నారు. జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) ఈ పరిణామాలను నిశితంగా పర్యవేక్షిస్తోందని వెల్లడించారు.ప్రాణాంతక ఎబోలా వైరస్ ఆఫ్రికా దేశాలైన కాంగో, ఉగాండాలో కలకలం రేపుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అప్రమత్తమైంది. ఈ సంక్షోభాన్ని అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటిస్తూ ఆదివారం నిర్ణయం తీసుకుంది. కాగా, ఎబోలా వైరస్ కారణంగా కాంగో, ఉగాండాలో ఇప్పటివరకు 90 మంది ప్రాణాలు విడిచారు. మరో 300కు పైగా ఎబోలా అనుమానిత కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కూడా అలర్ట్ అయ్యింది. దేశంలో ఏదైనా ఎబోలా అనుమానిత కేసు గుర్తిస్తే వెంటనే సంసిద్ధత, స్క్రీనింగ్ యంత్రాగాలు, ప్రతిస్పందన వ్యూహాన్ని అంచనా వేయడానికి ఒక సమీక్షా సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసింది.

### నిపుణులు ఏమంటున్నారంటే?

ప్రస్తుతం దేశంలో ఎబోలా వ్యాప్తి లేనప్పటికీ, అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచ అనుసంధానం కారణంగా భారత్ అంటువ్యాధుల ముప్పు పట్ల అప్రమత్తంగా ఉండాలని దిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ తెలిపారు. ప్రస్తుతం దేశానికి ఎబోలా ముప్పు తక్కువగానే ఉందన్నారు. "గతంతో పోలిస్తే దేశంలో పటిష్ఠమైన విమానాశ్రయ స్క్రీనింగ్ వ్యవస్థలు, వ్యాధి నిఘా యంత్రాంగాలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రపంచంలో ఎక్కడైనా అంటువ్యాధులు ప్రబలితే అవి దేశంలోని వచ్చే ప్రమాదం ఉంది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. కొవిడ్ లాగా ఎబోలా గాలి ద్వారా వ్యాపించదు. ఈ వైరస్ ప్రధానంగా వ్యాధి సోకిన వారి శరీర ద్రవాలతో ప్రత్యక్ష సంబంధం, అసురక్షిత ఖనన పద్ధతుల ద్వారా వ్యాపిస్తుంది. సరైన రక్షణ చర్యలు పాటించకపోతే ఆరోగ్య కార్యకర్తలు, ఫ్యామిలీ కేర్‌గివర్స్ (కుటుంబ సంరక్షకులు)కు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది." అని డాక్టర్ సంజయ్ రాయ్ వెల్లడించారు.కొవిడ్-19 మహమ్మారి తర్వాత భారతదేశ ఆరోగ్య సన్నద్ధత గణనీయంగా మెరుగుపడిందని మేదాంత ఆస్పత్రిలోని ఇంటర్నల్ మెడిసిన్, రెస్పిరేటరీ విభాగాధిపతి డాక్టర్ రణదీప్ గులేరియా అభిప్రాయపడ్డారు. దేశంలో ఇప్పుడు బలమైన ప్రయోగశాలల నెట్‌వర్క్‌లు, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ అకారణ జ్వరం, రక్తస్రావ లక్షణాలతో వచ్చే అంతర్జాతీయ ప్రయాణికులకు చికిత్స అందించేటప్పుడు ఆస్పత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎబోలా వ్యాప్తి గురించి భారతీయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

### ఎబోలా వైరస్ లక్షణాలు ఏంటంటే?

ఎబోలా వైరస్ గబ్బిలాల నుంచి మనషులకు సోకుతుంది. ఈ వైరస్ సోకిన వ్యక్తి శారీరక ద్రవాలు, రక్తాన్ని తాకినప్పుడు ఒకరి నుంచి మరొకరికి ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ ప్రాణాంతకమైన ఎబోలా వైరస్ 21 రోజులపాటు రోగిలో సజీవంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జ్వరం, అలసట, నీరసం, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతు నొప్పి, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, దద్దుర్లు, ఇంకా మూత్రపిండాలు, కాలేయ పనితీరు దెబ్బతినడం వంటి లక్షణాలు ఎబోలా వైరస్ సోకిన వారిలో కనిపిస్తాయి.

## బిగ్ అలర్ట్ దేశ వ్యాప్తంగా మెడికల్ షాప్‌లు బంద్



**టి మీడియా ,మే 19 ,హైదరాబాద్ బ్యూరో :** తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ కీలక సూచనలు చేసింది. డిజిటల్ ఈ-ఫార్మసీల అనియంత్రిత వృద్ధికి, కార్పొరేట్ సంస్థల దోపిడీ ధరల విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఫార్మా వ్యాపారులు నిరసన జ్వాలలు రగిల్చారు. ఈ మేరకు మే 20వ తేదీన అంటే బుధవారం హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో మెడికల్ షాప్‌లు క్లోజ్ చేయాలని నిర్ణయించారు. అఖిల భారత కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా... తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ , హైదరాబాద్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ ఒక్కరోజు సమ్మెకు దిగనున్నారు.భారీ నిధులతో మార్కెట్లోకి వస్తున్న కార్పొరేట్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల దూకుడు విస్తరణ వల్ల జంట నగరాల్లోని స్థానిక ఫార్మసీలు పూర్తిగా దెబ్బతింటున్నాయని అధ్యక్షుడు ఎ. శ్రీధర్ గుప్తా ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ... ఇది మా మనుగడ కోసం సాగిస్తున్న యుద్ధం. పెద్ద కార్పొరేట్ సంస్థలు ఇస్తున్న అడ్డగోలు డిస్కౌంట్ల వల్ల, ముఖ్యంగా సెమీ-అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న చిన్న మెడికల్ షాపులు మూతపడే పరిస్థితి వచ్చింది అన్నారు.కరోనా మహమ్మారి సమయంలో ఆన్‌లైన్ డ్రగ్ రిటైల్ నిబంధనలను సడలిస్తూ తెచ్చిన తాత్కాలిక అత్యవసర నోటిఫికేషన్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వ్యాపారులందరికీ సమాన అవకాశాలు కల్పించేలా కఠినమైన చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అయితే, ఈ సమ్మె వల్ల తెలుగు రాష్ట్రాల్లోని రోగులకు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రతినిధులు స్పష్టం చేశారు.

# రిషికేశ్‌లో తప్పిన భారీ రైలు ప్రమాదం

## పట్టాలు తప్పిన ఉజ్జయిని ఎక్స్‌ప్రెస్ బోగీలు!

**టి మీడియా ,మే 19 , ఢిల్లీ బ్యూరో :**
ఉత్తరాఖండ్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రం రిషికేశ్‌లో సోమవారం (మే 18) రాత్రి పెను రైలు ప్రమాదం తృటిలో తప్పింది. యోగనగరి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన ఈ ఘటన స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. షంటింగ్ పనుల సమయంలో ఉజ్జయిని ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఇంజన్, మరికొన్ని బోగీలు పట్టాలు తప్పడంతో ఒక్కసారిగా కలకలం రేగింది.మంగళవారం ప్రయాణం కోసం సిద్ధం చేయాల్సిన ఉజ్జయిని ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం రాత్రి లోకో పైలట్ షంటింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రైలును యార్డ్ వైపు మళ్లించి ట్రాక్ మారుస్తుండగా, ఖండ్ గ్రామం సమీపంలో ఊహించని ప్రమాదం జరిగింది. రైలు అదుపుతప్పి పట్టాలు తప్పడమే కాకుండా, ఒక బోగీ వేగంగా వెళ్లి రైల్వే స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి ఆ స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల ప్రాంతాలు ఒక్కసారిగా కంపించాయి. ఏం జరుగుతుందో అర్థం కాక సమీపంలోని గ్రామస్థులు భారీ సంఖ్యలో ఘటనా స్థలానికి పరుగులు తీశారు.ఈ ప్రమాదంలో అత్యంత ఊరటనిచ్చే విషయం ఏమిటంటే, ఆ సమయంలో రైలు పూర్తిగా ఖాళీగా ఉంది. కేవలం మెయింటెనెన్స్ కోసం రైలును షంటింగ్ చేస్తుండటంతో ప్రయాణికులు ఎవరూ లేరు. ఒకవేళ ఇదే ఘటన ప్రయాణికులతో నిండి ఉన్న సమయంలో జరిగి ఉంటే, పరిస్థితి ఊహకందని విధంగా అత్యంత దారుణంగా ఉండేదని అధికారులు భావిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ బృందాలు అక్కడకు చేరుకున్నాయి. భారీగా తరలివచ్చిన జనసమూహాన్ని నియంత్రించి, సహాయక చర్యలను పర్యవేక్షించాయి. సీనియర్ రైల్వే అధికారులు మరియు ఇంజనీర్ల బృందం కూడా వెంటనే



చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. “బ్రేక్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల రైలు అదుపు తప్పినట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం. లోకో పైలట్ అజాగ్రత్త కూడా ఉండవచ్చు. దీనిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించాం,” అని జీఆర్‌పీ ఎస్పీ అరుణా భారతి వెల్లడించారు. పట్టాలు తప్పిన ఇంజన్, బోగీలను తిరిగి ట్రాక్‌పైకి తెచ్చేందుకు సాంకేతిక బృందాలు రాత్రంతా శ్రమించాయి. దెబ్బతిన్న బోగీలను ప్రధాన రైలు నుండి వేరు చేశారని సీనియర్ కమర్షియల్ మేనేజర్ మహేష్ యాదవ్ తెలిపారు. ఈ ప్రమాదం ప్రధాన లైన్‌లో కాకుండా యార్డ్ సమీపంలోని ట్రాక్‌పై జరగడంతో, రిషికేశ్ వచ్చే ఇతర రైళ్ల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగలేదు. అన్ని రైలు సర్వీసులు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా నడుస్తున్నాయి. ఈ ఘటన ప్రాణనష్టం కలిగించకపోయినా, రైల్వే భద్రతా వ్యవస్థలపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. నిత్యం వేలాది మంది భక్తులు వచ్చే రిషికేశ్ వంటి ప్రాంతంలో ఇలాంటి సాంకేతిక లోపాలు తలెత్తడం భద్రతా వైఫల్యమేనా?, షంటింగ్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను విస్మరించారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఏది ఏమైనా, ఒక పెను విపత్తు తృటిలో తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దర్యాప్తు కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే అసలు కారణాలు పూర్తిస్థాయిలో వెలుగులోకి రానున్నాయి.



## జర్నలిస్ట్ మరణం తీరని లోటు

- ఐజేయు రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్

**టీ మీడియా, మే 19, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లాలోని గోపాల్ పేట మండలంలో వెలుగు దినపత్రిక జర్నలిస్టుగా ప్రజా సమస్యల కోసం నిరంతరం పరితపిస్తూ పనిచేస్తున్న జోగు రాములు అకాల మరణం జర్నలిస్ట్ లోకానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ టియుడబ్ల్యూజే , (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వెలుగు దినపత్రిక జర్నలిస్ట్ మరణం తెలిసిన వెంటనే రాష్ట్ర కార్యదర్శి వెంట తెలంగాణ టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవరావు, రాజు, రాష్ట్ర హౌసింగ్ సైట్స్ మెంబర్ శ్రీనివాసరావు ఈశ్వర్, తదితరులు మరణించిన జర్నలిస్టు జోగు రాములు కుటుంబాన్ని పరామర్శించి జర్నలిస్టు సంఘం తరఫున రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ తో చర్చించి తగిన న్యాయం చేసి ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల, నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాలో జర్నలిస్టులు వృత్తిపరంగా అనేక ఒత్తిళ్లకు గురవుతూ ఉండే పోటు మరణాలు, డయాబెటిస్, రోడ్డు ప్రమాదాలతో మరణిస్తున్న సంఘటనలు జీర్ణించుకోలేక పోతున్నామని వెంటనే వృత్తిలో కొనసాగుతూ కారణాలతో మరణిస్తున్న జర్నలిస్టులను తెలంగాణలో అతిపెద్ద జర్నలి (ఐజేయు ) జర్నలిస్టు సంఘం ఆదుకుంటుందని రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ తెలిపారు. ఇప్పటికే అనేక జర్నలిస్టు కుటుంబాలను తెలంగాణ టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ తరఫున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ ఆదుకున్న సంగతి గుర్తు చేశారు. జర్నలిస్టులు ఆత్మ ధైర్యం కోల్పోకుండా వృత్తి ధర్మాన్ని ఆత్మస్థైర్యంతో ముందుకు నడపాలని ఎవరు కూడా భయపడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అనేక సమస్యలు ఉన్నప్పటికీ ఆరోగ్యపరంగా విద్యాపరంగా వైద్య పరంగా అన్ని రంగాల్లో ( ఐజేయు )జర్నలిస్టు సంఘం ఆదుకుంటుందని ఆ విషయం ప్రతి ఒక్క జర్నలిస్టు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మృతి చెందిన జోగు రాములు కుటుంబాన్ని పరామర్శించారు.

## పాములు, మొసళ్ల భయం ఒకవైపు

- మూసీలో మహిళ పోరాటం!

**టి మీడియా ,మే 19 ,హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున ఉన్న మూసీ నది ప్రమాదకరమైన మలుపులకు, మురికి నీటికి పెట్టింది పేరు. అలాంటి నదిలోకి ప్రమాదవశాత్తు ఓ మహిళ జారిపడింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్నా ధైర్యం కోల్పోకుండా పోరాడి ప్రాణాలతో బయటపడ్డారు. ఆ ఉత్కంఠభరితమైన ఘటన భాగ్యనగరంలో తీవ్ర సంచలనం సృష్టించింది.హైదరాబాద్‌లోని బాలాజీ నగర్‌కు చెందిన బాలమణి అనే మహిళ రోజు వారీ పనుల్లో భాగంగా చాదర్‌ఘాట్ చిన్న బ్రిడ్జి సమీపంలోని మూసీ కాలువ వద్దకు వెళ్లారు. అక్కడ ముఖం కడుక్కోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఆమె కాలుజారి ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో పడిపోయారు. చూస్తుండగానే నీటి ప్రవాహం ఆమెను ముందుకు లాక్కెళ్లిపోయింది. మూసీ కాలువ కేవలం నీటి ప్రవాహమే కాదు, అక్కడ విషపూరితమైన పాములు, అప్పుడప్పుడు మొసళ్లు కూడా కనిపిస్తుంటాయి. నీటిలో పడిపోయిన బాలమణికి ఈ విషయం తెలుసు. ఒకవైపు నీటి ఉధృతి, మరోవైపు ప్రాణాంతక జంతువుల భయం ఆమెను చుట్టుముట్టాయి. కానీ, ఆమె తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. నీటిలో మునిగిపోకుండా ఉండేందుకు



గట్టిగా ప్రయత్నిస్తూ.. సహాయం కోసం ఆక్రందనలు చేసింది. మరోవైపు దొరికిన ఆధారాలను పట్టుకుంటూ ప్రాణాల కోసం పోరాడారు. ఆమె అరుపులు విన్న వెంటనే స్థానికులు స్పందించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన స్థానికులు చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం అందించారు. తామే స్వయంగా రంగంలోకి దిగి రక్షణ చర్యలు ప్రారంభించారు. స్థానికులు వెంటనే తాళ్లు, పొడవైన కర్రలను సేకరించి కాలువలోకి వదిలారు. సమాచారం అందిన నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, సమన్వయంతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. పోలీసులు, స్థానికులు కలిసి ప్రాణాలకు తెగించి పోరాడుతున్న బాలమణిని చాకచక్యంగా గట్టుకు చేర్చారు.నీటి నుంచి బయటపడిన బాలమణి భయంతో వణికిపోయినప్పటికీ, ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. పోలీసులు ఆమెను ప్రాథమిక చికిత్స నిమిత్తం తరలించి, ఆమె వివరాలు సేకరించారు. కేవలం అజాగ్రత్త వల్ల జరిగిన ఈ ప్రమాదం నుంచి ఆమె బయటపడటం ఒక అద్భుతమని అక్కడి వారు చర్చించుకున్నారు. ప్రమాదం ఎటు నుండి వస్తుందో తెలియదు, కానీ గుండె ధైర్యం ఉంటే మృత్యువు అంచు దాకా వెళ్లి కూడా తిరిగి రావచ్చు అని బాలమణి ఉదంతం నిరూపించింది. సమయానికి స్పందించిన పోలీసులను, స్థానికులను నగరవాసులు అభినందిస్తున్నారు.

## ప్రగతిశీల భావాజాలంతోనే సమస్యల పరిష్కారం

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, మే 19, వనపర్తి బ్యూరో :**
ప్రగతిశీల భావ జాలం ఉంటే ప్రజావాణికి వచ్చే సమస్యల మూలాలు అర్థమై వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్ లో ఆదిలాబాద్ జిల్లాలో ప్రజావాణి అమలు తీరుపై పైలెట్ ప్రాజెక్టు నివేదికను చిన్నారెడ్డి గారు, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజావాణికి వివిధ సమస్యలతో వచ్చే దరఖాస్తుదారుల పట్ల అధికారులు, సిబ్బంది సానుకూల ధోరణితో స్పందించాలని, అప్పుడే పిటిషనర్ల ముఖంలో సంతోషం చూడగలుగు తామని పేర్కొన్నారు.రాష్ట్ర, జిల్లా స్థాయిలో కొనసాగుతున్న ప్రజావాణిని డివిజన్ స్థాయికి రాష్ట్ర ప్రభుత్వం విస్తరించిందని, రానున్న కాలంలో మండల స్థాయిలో కూడా ప్రజావాణిని నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని చిన్నారెడ్డి తెలిపారు.సీఎం ప్రజావాణిలో ఓపికతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, నిర్వాహకులు హర్ష, ఆనందిత, అభిషేక్, అఖిల్, సీఎం ప్రజావాణి అధికారులు రాకేష్ రెడ్డి, జగన్, సాయి, పాల్గొన్నారు.



## బంజారా సమాజ హక్కుల కోసం ప్రశ్నిస్తే ముందస్తు అరెస్ట్

**టీ మీడియా, మే 19, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రంలో మూడో అతిపెద్ద గిరిజన సామాజిక వర్గమైన బంజారా సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్ మండి వ డ్డా రు. క్యాబి నె ట్ విస్తరణలో బంజారా సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, సేవాలాల్ బంజారా కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బంజారా సమాజానికి రాజకీయ, సామాజిక న్యాయం చేయాలని, వెంటనే మంత్రి పదవి, కార్పొరేషన్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్ డిమాండ్ చేశారు.



## రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయం


**టి మీడియా ,మే 19 , చెన్నై:**
తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధినేత సి. జోసెఫ్ విజయ్, లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం వ్యవస్థాపకుడు వేలుపిళ్లై ప్రభాకరన్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. 2009లో శ్రీలంక సైన్యం చేతిలో ప్రభాకరన్ హతమైన ముల్లివైక్కల్ విషాదాన్ని స్మరిస్తూ, తమిళుల హక్కుల కోసం తన గళాన్ని వినిపించారు. ముల్లివైక్కల్ జ్ఞాపకాలతో భావోద్వేగ సందేశం ఇచ్చారు.శ్రీలంక అంతర్యుద్ధం ముగిసిన ముల్లివైక్కల్ ప్రాంతాన్ని ప్రస్తావిస్తూ విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. “ముల్లివైక్కల్ జ్ఞాపకాలను మనం మన హృదయాల్లో పదిలపరుచుకుంటాము! సముద్రం అవతల నివసిస్తున్న మన తమిళ బంధువుల హక్కుల కోసం మనం ఎల్లప్పుడూ సంఘీభావంతో నిలబడతాము” అని ఆయన పేర్కొన్నారు. కేవలం భావోద్వేగంగానే కాకుండా, రాజకీయంగా కూడా ఈలం తమిళుల సమస్యపై తన వైఖరిని ఆయన స్పష్టం చేశారు.సాధారణంగా తమిళనాడులో అధికారంలో ఉన్న పార్టీలు కి ప్రత్యక్షంగా మద్దతు తెలపడానికి వెనుకాడుతుంటాయి. ముఖ్యంగా 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో ప్రభాకరన్ ప్రధాన నిందితుడిగా ఉండటం, భారత్‌లో పై నిషేధం కొనసాగుతుండటం ఇందుకు ప్రధాన కారణం. అయితే, విజయ్ మాత్రం సెప్టెంబర్ 2025లో నాగపట్టినం ప్రసంగంలోనూ ప్రభాకరన్‌ను ఉద్దేశించి మాతృ ప్రేమను చూపిన నాయకుడు అని అభివర్ణించారు.ప్రస్తుతం విజయ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వానికి అనుకూల వైఖరి కలిగిన విడుతలై చిరుతైగల్ కట్చి మద్దతు ఇస్తోంది. మరోవైపు, విజయ్ ముఖ్యమంత్రిగా తనదైన శైలిని చాటుకుంటున్నారు. రజనీకాంత్, కమల్ హాసన్ వంటి దిగ్గజాలు సైతం విజయ్ రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ, ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతుండటం గమనార్హం.ఇదిలావుంటే, ముల్లివైక్కల్ స్మరణ దినం అనేది కేవలం ఒక చారిత్రక ఘట్టం మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులకు అన్యాయంపై పోరాడే ఒక స్ఫూర్తిగా నిలుస్తోంది. 30 ఏళ్ల పాటు సాగిన ఈ సాయుధ పోరాటం ముగిసినా, తమిళుల హక్కుల పోరాటం మాత్రం నేటికీ రాజకీయాల్లో కీలక అంశంగానే మిగిలి ఉంది.



## కనీసం ‘సారీ’ చెప్పాలని కూడా మీకు అనిపించట్లేదా..?

- ఓ నీట్ అభ్యర్థి ఆవేదన

**టి మీడియా ,మే 19 ,హైదరాబాద్ బ్యూరో :**
డియర్ ఎన్టీయే.. నాకు 18 ఏళ్లు. నేను ఈ ఏడాది నీట్ 2026 పరీక్ష రాశాను. నా 12వ తరగతిలోనే నీట్ పరీక్ష కోసం శ్రమిస్తున్నాను. సోషల్ మీడియా దూరం పెట్టా. స్నేహితులతో మాట్లాడటం మానేశా. పార్టీలకు వెళ్లడం లేదు... నీట్‌లో ర్యాంకు కొట్టాలన్న ఒకే ఒక్క లక్ష్యంతో నా తోబుట్టువులతో కూడ మాట్లాడలేదు. ఈ పరీక్ష కోసం ఎన్నో త్యాగాలు చేశాను.. దేనికోసం? అవును, కేవలం డాక్టర్ అవ్వాలనే నా కల.. నా కెరీర్‌ను నిర్మించుకోవడం కోసం ఇదంతా చేయించింది.పరీక్ష సమీపిస్తున్న కొద్దీ నా ఆందోళన పెరిగసాగింది. అది సహజమే. ఆ తర్వాత పరీక్షకు సుమారు 10-12 రోజుల ముందు విడుదల చేసిన ఓ ప్రకటన చదివి ఇంకా భయపడ్డాను. ఇది పాఠశాల పరీక్ష కాదు. ఇది జాతీయ స్థాయి వడపోత పరీక్ష. అది స్కూల్‌లో జరిగే పరీక్ష కాదు.. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే స్కూళ్లలో జరిగే పరీక్షల్లో ప్రశ్నపత్రాలు లీక్ అవ్వడం జరగదు. కానీ నీట్ పరీక్షలో పేపర్ లీకులు షరా మామూలై పోయింది. మేము మిగతా పరీక్షల కంటే పది అడుగులు ముందుగా ఉంటామని ఎన్టీయే చెప్పుకోవడం సిగ్గుచేటు. పరీక్ష కేంద్రం బయట మమ్మల్ని తనిఖీ చేయడంలో మీరు నిజంగానే పది అడుగులు ముందున్నారు. ఎందులోనో తెలుసా? ఎగ్జాం సెంటర్ల ముందు మమ్మల్ని తనికీల పేరిట అనేక అంచెలుగా చెక్ చేస్తారు చూడు.. ఆ విషయంలో మీ భద్రత ఉంటుంది. కానీ పరీక్ష కేంద్రాల వద్ద పెట్టే అంచెలంచెల సెక్యూరిటీ ఎగ్జాం నిర్వహించే విషయంలో ఎందుకు పెట్టారు? నీట్ పరీక్ష రాయడానికి పరీక్ష కేంద్రానికి వెళ్లినప్పుడు మేము (విద్యార్థులు) ఎంత బాధపడ్డామో తెలుసా? కనీసం లోపలికి ఒక ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌ని కూడా అనుమతించలేదు. పర్వాలేదు. మా కలల కోసం మేము ఏదైనా




చేస్తాం. ఎన్ని త్యాగాలైనా చేస్తాం. అయినా ఈ వేడిలో నోరెండి పోతున్నా, మా కలల సాకారం కోసం అన్ని భరిస్తాం. పరీక్ష కేంద్రం బయట తనిఖీ పేరిట జరిగే ప్రహసనం ఇంకా నా కళ్ల ముందు మెదులుతూనే ఉంది.తనిఖీల పేరుతో అమ్మాయిల జడలు విప్పించి, మహిళ సిబ్బంది చేతులతో మా వెంట్రుకల లోపల వేళ్లతో నిమిరిమరీ చెక్ చేశారు. జేబులు ఉంటే వారి టీ-షర్టులు, ప్యాంట్లను కూడా కత్తిరించారు. ఇదంతా నా కళ్ల ముందే జరిగింది. ఇదంతా చూశాక.. అసలు పేపర్ లీక్ స్టూడెంట్స్ చేస్తారేమోనన్న అనుమానం మీకు ఉన్నట్లుంది. అయినా ఇదంతా భరించాం. ఈ తనికీలన్నీ చూసి ఈసారి పేపర్ లీక్ జరగదులే అన్న నమ్మకంతో ఎగ్జాం రాయడానికి పరీక్ష కేంద్రంలోకి వెళ్లాను.కానీ వాస్తవానికి ఏం జరిగింది? మాకు మిగిలిందేమిటి? ఈ లేఖ నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా మాత్రమే కాదు, మొత్తం వ్యవస్థకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి ప్రతీక. మా మాదిరి భవిష్యత్తులో ఇంకెవ్వరూ నష్టపోకూడదు. ఎన్టీయేని ఇక్కడ నేను ఒకటి అడుగుతున్నా.. పది అడుగులు ముందుండటం అంటే పేపర్ లీకేజీలోనా? అయినా పర్లేదు.. పరీక్ష రద్దు చేశారు కాబట్టి.. మళ్లీ చదువుతాం. మీరు తనిఖీల పేరుతో చేసే సెర్చింగ్ కూడా భరిస్తాం. కానీ ఇంత పెద్ద పరీక్ష పేపర్ లీకైనందుకు మీకు కనీసం పశ్చాత్తాపం అయినా ఉందా? లక్షల మంది విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు. విద్యార్థులమైన మాకు కనీసం ఒక క్షమాపణ అయినా చెప్పాలని మీకు అనిపించడం లేదా?మీకు ఓ విషయం అర్థం కావడం లేదు. నీట్ పరీక్ష కోసం నేను, నాలాంటి లక్షలాది విద్యార్థులు ఎన్ని కలలు కన్నామో తెలుసా? పరీక్ష తర్వాత మా తోబుట్టువులతో సమయం గడపబోతున్నందుకు మేమంతా చాలా సంతోషించాం. కానీ కేవలం రెండు రోజుల తర్వాత పరీక్ష మళ్లీ జరుగుతుందని తెలిసి షాకయ్యాం. వరదలో ఇల్లు కొట్టుకుపోయినట్లుగా మా ఆనందమంతా ఆవిరైపోయింది. పేపర్ లీకైన రోజు 11 ఏళ్ల వయసున్న నా చిన్న చెల్లెలు నాతో ఒక మాటఅంది. ‘అంతగా ఆశలు పెట్టుకోకు. భారత్‌లో మన భవిష్యత్తుపై ఎవరికీ శ్రద్ధలేదు’ అని చెప్పింది. ఆమె మనసులో అలాంటి ఆలోచనలు పుట్టేలా చేసింది ఎవరు? ఆమెకు ఏమి సమాధానం చెప్పాలి? వ్యవస్థ మనకు అనుకూలంగా ఉందని చెప్పాలా? మన పోరాటం ఈ వ్యవస్థతోనే అని చెప్పాలా? లేద.. ఈ వ్యవస్థ మనకు ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పాలా?అభద్రతాభావం ఎక్కడి నుండి వస్తుందో ఇప్పుడు నాకు అర్థమైంది. నా తమ్ముళ్లు, చెల్లెళ్లు ఇండియాలో చదవలేమని చెబుతున్నారు. మేము ఈ దేశంలో ఉన్నందుకు గర్వపడుతున్నామని నేను ఎలా గర్వంగా చెప్పగలను? ఈ రోజు నాకే ఆశ్చర్యం కలుగుతోంది. ఒకవేళ దేశ సరిహద్దులు, ఆంక్షలు లేకపోయి ఉంటే నేను ఈ దేశం బయట చదివేందుకు వెళ్లడం జరిగేది. ఎందుకంటే మన వ్యవస్థలో నియమాలు కేవలం కాగితాల మీద మాత్రమే కఠినంగా ఉంటాయి. ఆచరణలో ప్రతిసారీ మా నమ్మకాన్ని దెబ్బతీస్తుంటాయి. ఇప్పుడు నేను కూడా ఒకటి నిర్ణయించుకున్నాను. నీట్ ఎగ్జాంకి కష్టపడి చదివేవారికంటే లీక్ అయిన పేపర్ల ద్వారా విజయం సాధించేవారు ఉన్న చోట నేను ఉండలేను. కష్టానికి మాత్రమే విలువ ఇచ్చే ఆ ప్రపంచంలోకే వెళ్తాను.. ఇట్లు ఎంతో అసంతృప్తి చెందిన మీ పరీక్షార్థి.

## భార్యను నరికి చంపి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు

**టి మీడియా ,మే 19, హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్‌లోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం (మే 19) పట్టపగలు దారుణ సంఘటన చోటుచేసుకుంది. కవాడిగూడలోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తులో ఉన్న ఒక స్పా సెంటర్‌లో పనిచేస్తున్న మహిళను ఆమె భర్తే కత్తితో పొడిచి అతి కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు స్పాట్‌కు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.మృతురాలు బహదూర్ పురా కిషన్ బాగ్ ప్రాంతానికి చెందిన బంగి దేబోరా అనే మహిళగా గుర్తించారు. ఆమె కవాడిగూడలోని స్పా సెంటర్‌లో బ్యూటీషియన్‌గా విధులు నిర్వహిస్తోంది. గత కొంతకాలంగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం కూడా భార్యాభర్తల మధ్య తీవ్రమైన గొడవ జరిగింది. ఆ గొడవ తర్వాత దేబోరా యథావిధిగా తన విధులకు హాజరైంది.కోపంతో రగిలిపోయిన భర్త, తన వెంట కత్తిని సిద్ధం చేసుకుని స్పా సెంటర్‌కు చేరుకున్నాడు. మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. అక్కడ విచక్షణ రహితంగా దేబోరాపై దాడి చేసి, కత్తితో పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన అనంతరం నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు.సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు, క్లూస్ టీంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ప్రాథమికంగా మృతురాలి పేరు శ్వేత అని ప్రచారం జరిగినప్పటికీ, విచారణలో ఆమె పేరు బంగి దేబోరా అని స్పష్టమైంది. హత్య చేసిన తర్వాత నిందితుడు నేరుగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## శుభాకాంక్షలు తెలిపిన బిసి పొలిటికల్ జేఏసీ

**టీ మిడియా, మే 19, వనపర్తి బ్యూరో :**
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బీసీల ముద్దుబిడ్డ తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన సరిత తిరుపతయ్యకి మంగళవారం వారి నివాసంలో బిసి పొలిటికల్ జేఏసీ మదనాపూర్ మండల అధ్యక్షులు బి.మహేందర్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## న్యాయం కోసం వెళ్తే.. గర్భవతిని చేసిన సీఐ

- ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు

**టి మీడియా ,మే 19 ,హైదరాబాద్ బ్యూరో :**
భర్త వేధిస్తున్నాడని న్యాయం చేయాలని ఓ మహిళ.. మహిళా పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది.. పోలీసులకు ఫిర్యాదు చేసింది.. అయితే.. ఆ మహిళ పై కన్నేసిన సీఐ న్యాయం చేస్తానంటూ దగ్గరయ్యాడు.. ప్రేమ, పెళ్లి పేరుతో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.. గర్భవతిని చేశాడు.. పెళ్లి గురించి అడిగితే టాబ్లెట్లు మింగించి అబార్షన్ చేయించాడు.. వివాహితపై వేధింపులకు పాలడ్డ సిసిఎస్ సిఐ రాజుపై కేసు నమోదవ్వడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఖమ్మం కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీఐ భూక్యా రాజు నాయక్‌ను పోలీసు ఉన్నతాధికారులు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ ఖమ్మంలో జరిగిన ఈ ఘటన తెలంగాణలో కలకలం రేపింది.

**వివరాల ప్రకారం..**
వివాహిత మహిళను వేధించిన వ్యవహారంలో ఖమ్మం సి సి ఎస్ స్టేషన్ సి ఐ బానోత్ రాజుపై ఖమ్మం 2టౌన్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది.. 2023లో ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో రాజు నాయక్ సీఐగా ఉండగా ఓ మహిళ తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు నుంచి ఫోన్ నంబర్ తీసుకున్న సీఐ, న్యాయం చేస్తానని నమ్మించి తరచూ ఫోన్లు, మెసేజ్‌లు చేయడం ప్రారంభించాడు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అయితే, సీఐ ఆమెకు బలవంతంగా కొన్ని ట్యాబ్లెట్లు మింగించడంతో గర్భస్రావం అయిందని బాధితురాలు పేర్కొంది. ఆ తర్వాత కూడా పెళ్లి విషయాన్ని దాటవేస్తుండటంతో.. బాధితురాలు ఈనెల 7న ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణలో సీఐ వేధింపులకు పాల్పడినట్లు తేలడంతో ఉన్నతాధికారులు అతన్ని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.కాగా.. బాధితురాలికి ఇటీవలే ఆమె భర్త నుంచి కోర్టు ద్వారా విడాకులు మంజూరయ్యాయి. ఆమెకు విడాకులు ఇప్పించేందుకు సీఐ రాజు నాయక్ ఆమె భర్తపై ఒత్తిడి తెచ్చినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

## హైదరాబాద్ వాటర్‌బోర్డ్ జీఎం నివాసంలో ఏసీబీ సోదాలు

- కిలోన్నర బంగారం, రూ.1.10 కోట్ల నగదు గుర్తింపు

**టి మీడియా ,మే 19 ,హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్‌లోని జలమండలి బోర్డు ఇంజినీరింగ్ విభాగం మేనేజర్ అనంత లక్ష్మీ కుమార్ నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఇప్పటివరకు దాదాపు కిలోన్నర బంగారం, 2.5 కిలోల వెండి, హైదరాబాద్‌లో 6 ప్లాట్లు, నిజామాబాద్‌లో 3 ఎకరాల భూమి, రూ.1.10 కోట్ల నగదు, భారీగా ఆస్తిపత్రాలు గుర్తించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మల్లాపూర్‌లోని ఆయన నివాసంలో తెల్లవారుజాము నుంచి ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.



**రూ. కోటి నగదు గుర్తింపు**
ఏకకాలంలో 8 ప్రాంతాల్లోని ఆయన బంధువుల ఇళ్లల్లోనూ, హైదరాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏసీబీ తనిఖీలు చేస్తోంది. కుమార్‌కు పలు ప్రాంతాల్లో ఉన్న స్థిరాస్తులను గుర్తించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలను పరిశీలిస్తున్నారు.

## జయంతి ఉత్సవం పై సన్నాహక సమావేశం

**టీ మీడియా, మే 19, వనపర్తి బ్యూరో :**
సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి ఆధ్వర్యంలో సురవరం. ప్రతాప్ రెడ్డి జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధ్యక్షతన కవులు, సాహితీవేత్తలు సమావేశమై 28.05.2026 రోజు మొట్ట మొదటి వనపర్తి శాసనసభ్యులు సురవరం.ప్రతాప్ రెడ్డి 130వ జయంతి ఉత్సవాలు అత్యంత ఘనంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిరంజన్ రెడ్డి స్వగృహంలో సన్నాహక సమావేశం నిర్వహించారని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తెలిపారు. సురవరం.ప్రతాప్ రెడ్డి జయంతి ఉత్సవాలలో ముఖ్య వక్తలుగా సాగునీటి రంగ నిపుణులు శ్రీ వి.ప్రకాష్,శ్రీ శ్రీధర్ రావు దేశ్ పాండే, ప్రముఖ సాహితీవేత్త గన్నమరాజు.గిరిజా మనోహర్ బాబు పాల్గొంటారని అదేవిధంగా ఈ ఉత్సవ సమావేశములో ప్రస్తావించే పలు అంశాల గురించి చర్చించారు అని అశోక్ తెలిపారు.ఈ సన్నాహక సమావేశములో సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస.శంకర్ గౌడ్ సాహితీవేత్తలు వీరయ్య ,నారాయణ రెడ్డి,బైరోజు. చంద్రశేఖర్ ,మల్యాల.బాలస్వామి ,సత్తార్ ,చంద్రశేఖర్ నందిమల్ల.అశోక్, జోహెబ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.



# 21 నుంచి సరస్వతి అంత్య పుష్కరాలు

● భక్తుల కోసం 3 వేలకు పైగా ఆర్టీసీ ప్రత్యేకబస్సులు

**టి మీడియా ,మే 19 , జయశంకర్? భూపాలపల్లి :**



జయశంకర్? భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ఉండేందుకు ఆర్టీసీ ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేసినట్లు వరంగల్? రీజనల్? మేనేజర్? భవానీ ప్రసాద్? పేర్కొన్నారు. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమ స్థలమైన కాళేశ్వరంలో జరిగే పుష్కరాలకు ఈ నెల 21వ తేదీ నుంచి జూన్? 1 వరకు పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు.

**మొత్తం 3,360 బస్సులు**

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 3,360 బస్సులతో 5,772 ప్రత్యేక ట్రిప్పులను నడిపేందుకు కొత్త ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాంతంలోని హనుమకొండ, వరంగల్-1, వరంగల్-2, పరకాల, నర్సంపేట, జనగామ, భూపాలపల్లి, తొర్రూరు, మహబూబాబాద్ డిపోల నుంచి కాళేశ్వరానికి 59 ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. ఉమ్మడి వరంగల్? జిల్లాకు ప్రధానమైన హనుమకొండ బస్టాండు నుంచి మరిన్ని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ పుష్కరాల సమయంలో వివిధ ప్రాంతాల నుంచి నడిచే ఆర్టీసీ ప్రత్యేక బస్సులకు సాధారణ రోజుల్లో ఛార్జీ కన్నా 50 శాతం అధికంగా వసూలు చేస్తారని వారు అన్నారు. మహాలక్ష్మి ప్రయాణికులకు యథావిధిగా ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు.సీఎం, డీప్యూటీ సీఎంకు ఆహ్వానం : మహదేవపూర్? మండలం కాళేశ్వరంలో ఈ నెల 21న ప్రారంభం కానున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలకు హాజరు కావాలంటూ సీఎం రేవంత్ ?రెడ్డి, భట్టి విక్రమార్కను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ డైరెక్టర్? హనుమంతరావు ఆహ్వానించారు.

**30-40 లక్షల మంది హాజరయ్యే అవకాశం**

కాళేశ్వరం పుష్కరలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా, రద్దీకి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు మంత్రి కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్?బాబు పేర్కొన్నారు. పుష్కారాలకు సంబంధించి ఏర్పాట్లపై సీఎస్? కె.రామకృష్ణా రావు ఆధ్వర్యంలో సచివాలయంలో ఇటీవల ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ ?బాబు మాట్లాడుతూ ఈ నెల 21న ఉదయం 5.43 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి పుణ్యస్నానం ఆచరించి అంత్య పుష్కరాలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈసారి పుష్కరాలకు దాదాపు 30-40 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**భక్తుల కోసం మౌలిక సౌకర్యాలు ఏర్పాటు**

దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కరాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారని పేర్కొన్నారు. ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇవన్నీ జూన్? 1న ముగియనున్న పుష్కరాలకు విస్తృతమైన మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేశామని సీఎస్? పేర్కొన్నారు. ఈ పుష్కరాల్లో భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, శానిటేషన్?, ట్రాఫిక్?, రవాణాను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్?, డైరెక్టర్? హనుమంతరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు నవీన్? మిత్తల్?, ముకుంద్?రెడ్డి, అనితా రామచంద్రన్?, హరీశ్?, చంద్రశేఖర్?రెడ్డి హాజరయ్యారు.

**పుష్కరాల్లో భక్తుల ఆరోగ్యమస్తు!**

అంతేకాకుండా కాళేశ్వరం త్రివేణి సంగం పుష్కరాల్లో భక్తులకు సేవలు అందించేందుకు వైద్యశాఖ ప్రణాళిక రూపొందించింది. ఈ 12 రోజుల పాటు సాగే ఈ మహా వేడుకలను లక్షల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కొత్త కార్యచరణ చేసింది. అక్కడికి వచ్చిన వారు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా 16 వైద్య శిబిరాలు, 576 మంది సుశిక్షితులైన సిబ్బంది, 18 మంది ప్రత్యేక వైద్య నిపుణులను రంగంలోని దింపనుంది. మొత్తం 16 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఘాట్? ప్రధాన క్యాంప్?, కాళేశ్వరం పీహెచ్?సీ ప్రధాన క్యాంప్?, పాత ఈవో కార్యాలయం, దేవాలయ ప్రధాన ద్వారం, పార్కింగ్? ఏరియా-1, టెంట్? సిటీ, పార్కింగ్? ఏరియా-2, తాత్కాలిక బస్టాండ్?, పాత బస్టాండ్?, గోదావరి ప్రధాన ఘాట్?, హరిత హోటల్?, సరస్వతీ ఘాట్? నదీ తీరం, గంగారపు క్రాస్? రోడ్?, అన్నారం కెనాల్?, కాటారం పీహెచ్?సీ ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో పారామెడికల్? సిబ్బందికి బస, మందుల భద్రతకు స్టోరేజ్? గదులు కేటాయించారు.

# మెడికల్ విద్యార్థి దారుణ హత్య..

● హాస్టల్ గదిలో, మృతదేహం లభ్యం



**టి మీడియా ,మే 19 , పాటియాలా :** పంజాబ్‌లోని పాటియాలాలో దారుణం జరిగింది. మెడికల్ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న అతడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని కమల్ మిట్టల్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాన్సా జిల్లాలోని, బరేటాకు చెందిన కమల్ మిట్టల్ పాటియాలాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. న్యూలాల్ బాఘ్ ప్రాంతంలోని ఒక హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కమల్ స్నేహితులు అతడికి ఫోన్ చేశారు.ఎంతమంది, ఎన్నిసార్లు ఫోన్ చేసినా కాల్ లిఫ్ట్ చేయకపోవడంతో వాళ్లు అతడి హాస్టల్ గదిలోకి వచ్చి చూశారు. వాళ్లు వచ్చేసరికి కమల్ మృతదేహం రక్తపు మడుగులో పడి ఉంది. దీంతో ఈ విషయాన్ని అతడి స్నేహితులు పోలీసులకు తెలిపారు. పోలీసులు వచ్చి పరిశీలించగా, అతడి ఒంటిపై మూడు, నాలుగు కత్తిపోట్లు ఉన్నాయి. ముఖ్యంగా మెడమీద పొడవడంతో కమల్ అక్కడికక్కడే మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలం నుంచి పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. అక్కడి సీసీ కెమెరాల్ని పరిశీలించారు. ఇందులో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా, ఒంటిపై రక్తపు మరకలతో వెళ్తుండటాన్ని గమనించారు.అతడికి సంబంధించిన వివరాల్ని సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనకు గల కారణాల్ని పోలీసులు ఆరా తీస్తున్నారు. కమల్‌తోపాటు హాస్టల్‌లో ఉండే మరో నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిని విచారిస్తున్నారు. ఈ హత్య ఘటన స్థానికంగా కలవరం రేపింది. స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. హాస్టల్ బయట యువత, స్థానికులు భారీగా గుమిగూడి ఆందోళన చేపట్టారు. దీంతో శాంతి భద్రతలు అదుపుతప్పకుండా ఉండేందుకు భద్రతా బలగాల్ని భారీగా మోహరించారు. కేసు విచారణ వేగంగా జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎండలతో అట్టుడుకుతున్న ఇండియా

● దేశవ్యాప్తంగా. 48 డిగ్రీలకు చేరిక



**టి మీడియా ,మే 19 , ఢిల్లీ బ్యూరో:** దేశం ఎండ వేడిమితో అట్టుడుకుతోంది. అనేక ప్రాంతాల్లో గతంలో ఎప్పుడూ లేని ఎండలు నమోదవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో గరిష్టంగా 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకర స్థాయి. దేశ రాజధాని ఢిల్లీతోపాటు మహారాష్ట్రలోని విదర్భలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు ఈ ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు.రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగి, వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. మహారాష్ట్రలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విదర్భ, అమరావతి పట్టణాల్లో 46.8 డిగ్రీలు, వార్ధాలో 46.5 డిగ్రీలు, అకోలాలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇతర పట్టణాల్లో కూడా ఇదే స్థాయిలో టెంపరేచర్ పెరుగుతోంది. మహారాష్ట్ర, ఢిల్లీలాంటి చోట్ల ఇప్పుడప్పుడే ఎండలు తగ్గే అవకాశం లేదని ఐఎండీ హెచ్చరించింది. అనేక ప్రాంతాల్లో 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రాంతంలో ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.ఢిల్లీలో ఉష్ణోగ్రతలతోపాటు వాయు కాలుష్యం కూడా కలవరపెడుతోంది. ఈ వారం అంతా నార్త్ ఇండియా, సెంట్రల్ ఇండియా, వెస్టర్న్ ఇండియాలలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. భారీ ఎండల నేపథ్యంలో ఐఎండీ.. ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, ఎండ ప్రభావానికి గురి కాకుండా చూసుకోవాలని, ఇండ్లలోనే ఉంటూ తగినన్ని నీళ్లు తాగాలి, ముఖ్యంగా పగటి పూట బయటకు వెళ్లొద్దని సూచించింది.

# వీధి కుక్కల తరలింపు ఆదేశాలు కొనసాగుతాయ్

● ఉపసంహరణకు సుప్రీంకోర్టు నో

**టి మీడియా ,మే 19 , ఢిల్లీ బ్యూరో :**

బహిరంగ ప్రదేశాలు, వీధుల్లో సంచరించే కుక్కలను అక్కడి నుంచి తరలించాల్సిందేనని సుప్రీంకోర్టు మరోసారి తేల్చి చెప్పింది. కుక్కల దాడుల తీవ్రతను, ముఖ్యంగా పసిపిల్లలపై జరుగుతున్న దాడులను ఏమాత్రం విస్మరించలేమని తెలిపింది. వీటి ముప్పు లేకుండా జీవించే హక్కు పౌరులకు ఉందని నొక్కి చెప్పింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల తొలగింపునకు సంబంధించి 2025 నవంబర్‌లో తాము జారీ చేసిన ఆదేశాలను సవరింబోమని స్పష్టం చేసింది. జంతు హక్కుల కార్యకర్తలు దాఖలు పిటిషన్లు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్?వీ అంజారియాలతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది. అలాగే తమ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడింది.'బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కల సంచారం తీవ్ర ఆందోళనకరంగా మారింది. గౌరవప్రదమైన జీవన హక్కు అంటే కుక్కల దాడుల భయం లేకుండా స్వేచ్ఛగా జీవించే హక్కు కూడా. ఈ విషయంలో రాష్ట్రాలు కేవలం ప్రేక్షకుల్లా ఉండలేవు. దేశవ్యాప్తంగా పిల్లలు, వృద్ధులు, విదేశీ పర్యాటకులు కూడా వీధి కుక్కల దాడులకు గురవుతున్నారు. పిల్లలు, వృద్ధులు తమ శారీరక శక్తి లేదా అదృష్టం మీద ఆధారపడి బతకాల్సిన సమాజాన్ని రాజ్యాంగం ఊహించలేదు. వీధి కుక్కల జనాభాను అరికట్టేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను పటిష్టం చేయాలి' అని ధర్మాసనం పేర్కొంది.

**ప్రతి జిల్లాలో జంతు జనన నియంత్రణ కేంద్రం**



భారత జంతు సంక్షేమ బోర్డు ఫ్రేమ్?వర్క్ నిబంధనలను కచ్చితంగా దేశంలోని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తిస్థాయి జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రాల జనసాంద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైతే మరిన్ని ఏబీసీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కూడా కోర్టు సూచించింది. అంతేకాకుండా జాతీయ రహదారులపై సంచరించే పశువుల సమస్యను కాలపరిమితిలో పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సమస్యపై పర్యవేక్షణ, సమన్వయ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించింది. వీధి పశువులను నియంత్రించేందుకు పనికిరాని పాత రవాణా వాహనాలను వినియోగించాలని ధర్మాసనం ఆదేశించింది.

**హైకోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశాలు**

వీధి కుక్కల నిర్వహణ సమస్యను ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న సంబంధిత హైకోర్టులు పర్యవేక్షించాలని ఆదేశించింది. ఈ విషయంలో తమ ఆదేశాలను అమలు జరిగేలా చూసేందుకు అన్ని హైకోర్టులు సుమోటోగా విచారణ చేపట్టాలని పేర్కొంది. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఆగస్టు 7లోపు తమ పరిధిలోని హైకోర్టులకు అమలు నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే విధంగా నివేదిక సమర్పించాలని పేర్కొంది. దేశంలోని హైకోర్టులు నవంబర్ 17లోపు సమగ్ర అమలు నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించాలని ఆదేశించింది.గతేడాది నవంబర్ 7న వీధి కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ అంశంపై విచారణ చేపట్టింది. అప్పుడు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, క్రీడా ప్రాంగణాలు, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రాంతాల నుంచి వీధి కుక్కలను తొలగించాలని ఆదేశించింది. పట్టుకున్న వీధి కుక్కలను మళ్లీ అదే ప్రాంతంలో వదలకూడదని కూడా స్పష్టం చేసింది. స్థానిక సంస్థలు వీధి కుక్కలను పట్టుకుని టీకాలు, శస్త్రచికిత్సలు చేసిన అనంతరం గుర్తించిన ఆశ్రయ కేంద్రాలకు తరలించాలని అప్పట్లో సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల బెడదను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి ఈ ఉత్తర్వులను జారీ చేసింది. ఆదేశాలకు దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది.

# హైదరాబాద్‌లో అరగంట ప్రయాణం

● స్టీల్ బ్రిడ్జితో ట్రాఫిక్‌కు చెక్

**టి మీడియా ,మే 19 ,హైదరాబాద్ బ్యూరో :**



మనం అరగంట చేసే ప్రయాణం ఐదు నిమిషాలకు తగ్గితే ఎలా ఉంటుంది? నిజానికి చెప్పాలంటే వాహనదారులకు అంతకు మించిన సంతోషం మరొకటి ఉండదు! ఏళ్లకు ఏళ్లుగా ట్రాఫిక్ సమస్యతో నరకం చూస్తోన్న హైదరాబాద్? నగరంలోని సంతోశ్? నగర్, చంచల్‌గూడ ప్రాంత ప్రజల తీవ్రమైన సమస్య మరికొన్ని రోజుల్లో తీరబోతుంది. అలాగే పిలిస్తే పలికేంత దూరంలో ఉన్న మూసారాంబాగ్, అలీకేఫ్ ప్రాంతాల మధ్యనున్న మూసీ నదిపై వంతెన పనులు జరుగుతుండటంతో నది దాటేందుకు వాహనదారులు సగటున 5 కిలో మీటర్లు అదనంగా ప్రయాణిస్తున్నారు. వారి కష్టాలకూ త్వరలో బ్రేక్ ?పడబోతోంది. ఈ రెండు బ్రిడ్జిలను జూన్ నెలాఖరు లేదా జులై మొదటి వారంలో అందుబాటులోకి తీసుకొస్తామని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**85 శాతం పనులు పూర్తి**

చంచల్‌గూడ జైలు జంక్షన్ నుంచి సంతోశ్?నగర్ వరకు 3.32 కిలోమీటర్లు పొడవున రూ.620 కోట్లతో నిర్మిస్తోన్న ఉక్కు బ్రిడ్జి పనులు భూ సేకరణ, నిధుల సమస్యతో రెండేళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిధుల సమస్యను పరిష్కరించి పనుల్లో వేగం పెంచారు. వారానికోసారి ముఖ్య ఇంజినీరు సహదేవ్ రత్నాకర్‌తో నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షలు చేస్తున్నారు. 85 పిల్లర్లుండగా, 74 పిల్లర్లపై స్లాబు పనులు పూర్తయినట్లు సీఈ రత్నాకర్ వివరించారు. మొత్తంగా 85 శాతం పనులు పూర్తయినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సైదాబాద్ నుంచి సంతోశ్? నగర్ వైపు వెళ్లేందుకు మూడు ట్రాఫిక్ సిగ్నళ్లను దాటాల్సి ఉంది. ఈ ఫ్లై ఓవర్? అందుబాటులోకి వస్తే నల్గొండ ఎక్స్ రోడ్స్ నుంచి ఒవైసీ ఆస్పత్రి వరకు ఉన్న 6 కిలో మీటర్ల రోడ్డు మార్గంపై ట్రాఫిక్ సమస్యలు 90 శాతం వరకు తగ్గుతాయి.

**చకచకా మూసారాంబాగ్ బ్రిడ్జి**

అంబర్‌పేట్ అలీ కేఫ్, మూసారాంబాగ్ మధ్య రాకపోకల కోసం మూసీ నదిపై రూ.52 కోట్లతో నిర్మిస్తోన్న రెండు హై లెవల్ బ్రిడ్జిల్లో ఒక వంతెన పనులు జూన్ చివరికి మొత్తం పూర్తవుతాయని జీహెచ్ఎంసీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అంబర్‌పేట్ నుంచి మలక్‌పేట్ వైపు వెళ్లే వాహనాల కోసం నిర్మిస్తోన్న ఈ వంతెన పనులు ఇప్పటి వరకు 72 శాతం పూర్తయినట్లు సీఈ రత్నాకర్ తెలిపారు. ప్రస్తుతం ఈ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు గోల్నాక బ్రిడ్జి వరకు అదనంగా ప్రయాణం చేసి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో 5 కిలో మీటర్ల దూరం పెరుగుతోంది. బ్రిడ్జి పనులు 48 శాతం పూర్తయ్యాయి.

## కళ్ల ముందే తడిసిపోతున్నా

# కాపాడుకోలేని ధాన్యం

● రైతులపాలిట శాపంగా మారిన అకాల వర్షాలు

**టి మీడియా ,మే 19 ,హైదరాబాద్ బ్యూరో :**



అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. కష్టపడి పండించిన పంట అంత తడిసిముద్దైంది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కళ్ల ముందే తడిసిపోతుంటే కర్షకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తడిసిన ధాన్యాన్ని కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు.ద్రోణి, ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో ఉరుములు-మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజులు గడిచినా కొనుగోళ్లు జరగకపోవడంతో పలుచోట్ల మార్కెట్ యార్డుల్లోని ధాన్యం వర్షానికి తడిచిపోయిందని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

**కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం**

మెదక్ జిల్లాలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి పలుచోట్ల ధాన్యం తడిచిపోయింది. కొల్చారం, హవేలీ ఘన్?పూర్ మండల కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దైంది. ఈదురు గాలులకు జోగిపేట మెదక్ ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. పిడుగుపాటుతో ఓ రైతుకు చెందిన ఆవు మృతి చెందింది. కామారెడ్డి జిల్లా తాండూరు, మాసంపల్లి, భవానిపేట, మంబాజీపేట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఆదిలాబాద్ జిల్లాలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలి వానకు కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దైంది.

**రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్**

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవందర్ రెడ్డి విమర్శించారు. మెదక్ జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం లింగారెడ్డిపల్లి కొనుగోలు కేంద్రం వద్ద హమాలీల కొరత, లారీల ఇబ్బందులపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. గజ్వేల్ - రామాయంపేట ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. మెదక్ మండలం పేరూర్ ఐకేపీ కేంద్రంలో తూకం వేసిన ధాన్యానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఇద్దరు రైతులకు చెందిన సుమారు 100 బస్తాల ధాన్యం కాలిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

**రైతులను నిండా ముంచిన వర్షాలు**

అకాల వర్షాలతో కల్లాల్లో ధ్యానం తడిచిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయకపోతే తమ కష్టం వృథాగా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం కూడా వరంగల్? జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షం రైతులను నిండా ముంచింది. పలు మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి. టార్పాలిన్స్ కప్పినా ధాన్యాన్ని కాపాడుకోలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

టే మీడియా లో ఉచిత సేవలు లేవు
BREAKING NEWS
డిజిటల్ మీడియా లో అగ్రగామిగా ఉన్న టీ మీడియా (తెలుగు డిజిటల్)లో ఉచిత సేవలు నిలిపి వేయడం జరిగింది.
ముఖ్యంగా ప్రెస్ కోట్లు/వ్యాపార అనుబంధ వార్తలు/ ప్రైవేట్ విద్యా, వైద్య సంస్లలు వారివి ప్రచురణ, ప్రసారం కు నిర్టీత రుసుము చెల్లించాలి.
గమనిక: మానవీయ కోణం వార్తలు/ ప్రతిఫలం ఆశించని సేవా కార్యక్రమాలు కు ఉచితం.
మాకు అఫీస్ అద్దె, సిబ్బంది సేవలు, కరెంట్, నెట్ లాంటివి
ఉచితంగా రావడం లేదు కారణంగా సేవ రుసుము నిర్ణయం చేయడం జరిగింది.
మీ అందరి సహకారం, అభిమానం, నమ్మకమే మా బలం. మీ మద్దతుతో మరింత బాధ్యతాయుతంగా పని చేస్తాం.
ఇట్లు టీ మీడియా family
PhonePe ACCEPTED HERE
Scan & Pay Using PhonePe App
SANAGAPATI MURALI KRISHNA
ఫొన్ నెంబర్లు : 8919710365, 7382990365, 8500459365
Email : tmediachannel1@gmail.com